# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 5, జులై 2026


# ఆదివాసీ గిరిజనులకు తప్పని తిప్పలు

బెజ్జూర్, జూలై 4, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలు ఒర్రెలపై వంతెనలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.సోమిని,కృష్ణపల్లి మధ్యలో ఉన్న రెండు ఒర్రెలు శనివారం ఉధృతంగా ప్రవహించడంతో వివిధ పనుల నిమిత్తం బెజ్జూర్ మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు ఒర్రెలు దాటి వెళ్లడానికి ఎంతో ఇబ్బంది పడ్డారు.గిరిజన గ్రామాల్లో ఏటా వానాకాలం వస్తే చాలు జనం అత్యవసర సమయాల్లో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతకాల్సి వస్తోంది.ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ బతుకులు మారడం లేదని,ఒర్రెలపై వంతెనలు నిర్మించి తమ కష్టాలను తీర్చాలని వారు కోరుతున్నారు.





* వేదఘోష, సరస్వతీ బీజాక్షర మంత్రోచ్ఛారణలతో మారుమ్రోగిన ఆలయ ప్రాంగణం
* దత్తాత్రేయ స్వామి మందిర నిర్మాణానికి భూమి పూజ చేసిన స్వామిజీ

## బాసర సరస్వతి ఆలయంలో

# పూజ్య శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రత్యేక పూజలు

భైంసా, జులై 04, ప్రభాతవార్త:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో మైసూర్ అవధూత దత్తపీఠ ఉత్తరాధికారి పూజ్య శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన స్వామీజీకి ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనాదేవి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. స్వామీజీ రాకతో ఆలయ ప్రాంగణమంతా ఓం శ్రీం హ్రీం సరస్వత్యై నమః అనే సరస్వతీ బీజాక్షర మంత్రోచ్చారణలు, వేదఘోషతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామీజీని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి అంతరాలయంలో స్వామీజీ ప్రత్యేక పూజలు చేశారు. ఓం శ్రీం హ్రీం సరస్వత్యై నమః బీజాక్షర మంత్రాన్ని స్వామీజీ స్వయంగా ఉచ్చరించగా, అక్కడి భక్తులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో మిగతా 2లో..

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూలై 4, ప్రభాతవార్త

నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య వర్ధంతి ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య మిగతా 2లో..



## ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో

# ప్రభుత్వం విఫలం

ఆసిఫాబాద్, జులై 4, ప్రభాతవార్త :

ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహానీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు మిగతా 2లో..




# నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలి



✦ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

హాజీపూర్, జూలై 4, ప్రభాతవార్త

ఎల్లంపల్లి పరిధిలోని నీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం ఎల్లంపల్లి సెగ్మెంట్ గుడిపేట నీటి శుద్ధి కేంద్రాన్ని ఈఈ (గ్రిడ్ ఎంబీ) కె. మధుసూదన్, హాజీపూర్ తహసీల్దార్ పుష్పలత, డీఈఈ, ఏఈఈలు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగాఅందించేందుకు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఫిల్ట్రేషన్, మిగతా 2లో..

## బాసర సరస్వతి ఆలయంలో

# పూజ్య శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రత్యేక పూజలు

(మొదటిపేజీ తరువాయి)

అనుసరించారు. అమ్మవారికి పూజ్య శ్రీ స్వామీజీ ప్రత్యేక హారతులు ఇచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామీజీ వేద పండితులకు, అర్చకులకు శేష వస్త్రం, ఫల పుష్పాలు అందజేసి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ.. వేద మంత్రాల ప్రాధాన్యతను, బీజాక్షరాలలో నిక్షిప్తమై ఉన్న దైవీశక్తిని, వాటిని జపించడం వల్ల కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. బీజాక్షర జపం మనసుకు ఏకాగ్రతను, ఉన్నతమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని తెలిపారు.

### దత్తాత్రేయ మందిరానికి శంకుస్థాపన:

ఆలయ దర్శనం అనంతరం బాసర క్షేత్రానికి ఒక కిలోమీటర్ దూరంలో (కమ్మ సంఘం పక్కన) నూతనంగా నిర్మించ తలపెట్టిన దత్తాత్రేయ స్వామి మందిరం, పాదుకా క్షేత్రానికి స్వామీజీ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసిల్దార్ పవన్ చంద్ర, ఆలయ ఏఈఓ గంగ శ్రీనివాస్, ఆలయ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సమస్యలు పరిష్కరించడంలో

# ప్రభుత్వం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కుటుంబాలు సాగు చేస్తున్న భూములపై పూర్తి హక్కులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రజలకు విద్య అందించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మారుమూల తండాలు, గూడేలలో పాఠశాలలు ఉన్నా ఉపాధ్యాయుల కొరత, రవాణా సమస్యలు వంటి సమస్యలు ఉన్నాయన్నారు. ఆదివాసీల ఆరోగ్యం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆదివాసీల కోసం అనేక వాగ్దానాలు చేశారని, వాటి అమలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీలు బహుజన ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వారితో పాటు ఎస్సీలు ముస్లింలు బహుజన రాజ్యాధికారం కోసం మాయావతి నాయకత్వంలో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్, పార్లమెంట్ ఇంచార్జ్ సాలం బిన్ హసన్, జిల్లా అధ్యక్షుడు దుర్గం తుకరాం, జిల్లా ఉపాధ్యక్షుడు ముదస్సీర్ హుస్సేన్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహ్మద్ సిరాజుద్దీన్, ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కనక ప్రభాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి చునార్కర్ చరణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

(మొదటిపేజీ తరువాయి)

వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణ నిరంతరం పర్యవేక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు, పంపింగ్ వ్యవస్థ, నిల్వ సామర్థం, విద్యుత్ సరఫరా, నిర్వహణపై అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, యంత్రాల నిర్వహణ, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన త్రాగునీరు అందేలా అన్ని ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వివిధ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నియామక విధానం, విధుల నిర్వహణ, హాజరు, వేతనాల చెల్లింపు, తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఆర్పీ3 గనిని సందర్శించిన జీఎం మునిగంటి శ్రీనివాస్

**- ప్రమాద స్థలాన్ని పరిశీలించి, రక్షణ చర్యలపై అధికారులకు ఆదేశాలు**

**నస్పూర్, జూలై 4, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ శనివారం ఎస్ఆర్పీ 3 భూగర్భ బొగ్గు గనిని సందర్శించారు. గనిపైకి చేరుకున్న ఆయన తొలుత ఏజెంట్ మరియు ఇతర అధికారులతో కలిసి గని యొక్క బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అనంతరం జీఎం గని భూగర్భంలోకి దిగి క్షేత్రస్థాయి పనిప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇటీవల గనిలోని 5వ సీమ్‌లో సైడ్ ఫాల్ ప్రమాదం చోటుచేసుకున్న డిస్ట్రిక్ట్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుతెన్నులను, దానికి గల కారణాలను అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూగర్భంలోని భద్రతా పరిస్థితులను గమనించిన జీఎం, అధికారులు మరియు కార్మికులకు రక్షణపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో కార్మికుల రక్షణే ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. నిర్దేశిత రక్షణ సూత్రాలను పాటిస్తూ, అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిన తర్వాతనే పనిప్రదేశాలలో పనులు చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఏ చిన్న ప్రమాదం కూడా పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు ఎస్ఓపీ, ఎస్ఎంపీ నిబంధనలకు లోబడి పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్ మరియు గని అధికారులు పాల్గొన్నారు.

## బారెగూడలో ఇంటింటికీ భగీరథ జలాలు...

# రూ.9 లక్షలతో కొత్త నల్లా కనెక్షన్లు

**- సర్పంచ్ కోట వేణుగోపాల్ ప్రత్యేక చొరవతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 4, ప్రభాతవార్త :**



బారెగూడ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న మంచి తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ ప్రత్యేక చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మిషన్ భగీరథ పథకం ద్వారా సుమారు రూ.9 లక్షల వ్యయంతో గ్రామంలోని ప్రతి ఇంటికి కొత్త నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసి, స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామంలో గతంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ కోట వేణుగోపాల్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయడంతో ప్రస్తుతం ఇంటింటికీ నిరంతరాయంగా మంచి తాగునీరు అందుతోంది. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని, భవిష్యత్తులో కూడా గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న సర్పంచ్ కోట వేణుగోపాల్‌ను గ్రామ ప్రజలు అభినందిస్తూ, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు.

# కామ్రేడ్ దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు

**బెల్లంపల్లి, జూలై 04, ప్రభాతవార్త**




తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా బెల్లంపల్లి సీపీఐ పట్టణ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో దొడ్డి కొమరయ్య పేరు స్వర్ణాక్షరాలతో లిఛంచబడింది. ఆయన ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ, తన త్యాగంతో తెలంగాణ రైతాంగ పోరాటానికి నూతన దిశను చూపిన మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన అమరత్వం కేవలం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు. అది శతాబ్దాలుగా కొనసాగుతున్న భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల తిరుగుబాటుకు నాంది పలికిన సంఘటన. దొడ్డి కొమరయ్య 1923 ఏప్రిల్ 3న అప్పటి నల్లగొండ జిల్లాలోని, ప్రస్తుతం జనగామ జిల్లాలో ఉన్న కడవెండి గ్రామంలో ఒక సాధారణ గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న దోపిడీని ఆయన ప్రత్యక్షంగా గమనించారు. వ్యవసాయం, పశు పోషణ చేస్తూ జీవనం సాగించిన కొమరయ్య, గ్రామంలోని పేద రైతుల సమస్యలను తన సమస్యలుగానే భావించారు. ప్రజలలో పెరుగుతున్న చైతన్యం, రైతాంగ సంఘాల కార్యకలాపాలు ఆయనను ఉద్యమం వైపు ఆకర్షించాయి. 1946 జూలై 4న కడవెండి గ్రామ ప్రజలు దేశ్‌ముఖ్ అన్యాయాలకు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో దొడ్డి కొమరయ్య ముందుండి నినాదాలు చేస్తూ ప్రజలను నడిపించారు. ప్రదర్శన దేశ్‌ముఖ్ గడికి చేరుకున్నప్పుడు భూస్వాముల అనుచరులు ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొమరయ్యకు బుల్లెట్ తగిలి ఆయన అక్కడికక్కడే అమరుడయ్యారు. ఆయన సోదరుడు దొడ్డి మల్లయ్య సహా మరికొందరు గాయపడ్డారు. ఈ సంఘటన తెలంగాణ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది అని కొమరయ్య పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి కామ్రేడ్ అడెపు రాజమౌళి, మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ, రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, నాయకులు బండారు శంకర్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ పరకాల నాగన్నకు విప్లవ జోహార్లు

## - రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండు బానేష్



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 04, ప్రభాతవార్త**

ఖమ్మం పట్టణంలో కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ జూలై 3, 2026న కామ్రేడ్ పరకాల నాగన్న తుది శ్వాస విడిచారు. ఆయన మృతి విప్లవ సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. యుక్త వయసులోనే విప్లవ రాజకీయాల ప్రభావంతో, కామ్రేడ్ మద్ది వెంకటరెడ్డి (మహేష్ అన్న) ప్రోత్సాహంతో పశువుల కాపరిగా జీవనం సాగిస్తూ కళాకారుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. విప్లవ స్ఫూర్తితో కామ్రేడ్ పొట్ల రామ నరసయ్య, శ్రీపాద శ్రీహరి, మంగన్న తదితర అమరుల త్యాగాలు ఆయనపై గాఢ ప్రభావం చూపాయి. ఎమర్జెన్సీ అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో పూర్తి కాల సభ్యునిగా చేరి, బుర్రకథ దళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు, అరుణోదయ రామారావుల మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఖమ్మం, వరంగల్, ప్రకాశం, నెల్లూరు, విశాఖ, నల్లగొండ, నిజామాబాద్, రామగుండం వంటి ప్రాంతాల్లో సాంస్కృతిక దళాల నిర్మాణానికి కృషి చేశారు. 1980ల నుంచి అరుణోదయ రాష్ట్ర కమిటీల్లో సభ్యునిగా కీలక పాత్ర పోషించిన ఆయన, విమల, శక్తి, జయరాజు, సృజన వెంకట్రాముడు, హనుమంతరావు తదితరులతో కలిసి అనేక కళారూపాలను ప్రజలకు అందించారు. 1990లలో ప్రజా రచయితల సంఘం అభివృద్ధిలోనూ భాగస్వామ్యమై, నమ్ము జీవన్, అద్దెపల్లి రామ్మోహన్ రావు, సతీష్ చందర్ వంటి వారితో కలిసి ప్రజారంగాన్ని బలోపేతం చేశారు. ప్రజా సమస్యలను ప్రతిబింబించే అనేక గీతాలను రచించి, ఆర్. నారాయణ మూర్తి చిత్రాలకు కూడా పాటలు అందించారు. గోదావరి లోయ ప్రతిఘటన, రైతు ఉద్యమాలు, అమరవీరుల త్యాగాలను తన గానంతో ప్రజల్లోకి తీసుకెళ్లారు. "అమరుడా ఓ అమరుడా", పడుతుంది గోదావరి", "పొద్దు పొడిచే.." వంటి గీతాలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించాయి. తీవ్రమైన అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఉద్యమ పథంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యునిగా, ప్రతిఘటన పోరాటాలలో పాల్గొంటూ తన జీవితాన్ని అంకితం చేశారు. అరెస్టులు, నిర్బంధాలను లెక్క చేయకుండా సాంస్కృతిక రంగంలో సేవలు అందించారు. ఆయన జీవిత సహచరి కామ్రేడ్ లక్ష్మక్క, కుమారుడు అజయ్ కూడా సాంస్కృతిక రంగంలో కొనసాగుతూ ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజా వాగ్గేయకారుడు, సాంస్కృతిక యోధుడు, విప్లవ గాన స్వరం అయిన కామ్రేడ్ పరకాల నాగన్న మరణం విప్లవ ఉద్యమాలకు అపూర్వ నష్టం. ఆయన సేవలు, త్యాగాలు ఎప్పటికీ స్మరణీయాలు అని రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండు బానేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

## - విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత

**సారంగాపూర్, జులై 04, ప్రభాతవార్త**

మండలంలోని జాం గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రూ. 38 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఏవో అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నాగపూర్ గ్రామంలో రూ. 52 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) భవనం, వీవో భవనం, వర్క్ షెడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పల్లెల సమగ్ర వికాసానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే మహిళా సంఘాల భవనాలకు, గ్రామ పంచాయతీలకు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు భారీగా నిధులు కేటాయిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కలిపె రవళి విలాస్, లలితా బాయి, నాయకులు రావుల రామనాథ్, ముత్యం రెడ్డి, మెడిసెమ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెలోనూ ఇందిరమ్మ ఇండ్ల పండగ

## - మార్లగొండకు ఇండ్లు మంజూరు చేయడంపై ముఖ్యమంత్రికి, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి గ్రామస్తుల కృతజ్ఞతలు

**భైంసా, జులై 04, ప్రభాతవార్త:**



నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతి పల్లెలోనూ ఇందిరమ్మ ఇండ్ల పండగను తీసుకువస్తోందని ముథోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి పేర్కొన్నారు. భైంసా పట్టణంలోని తన నివాసంలో కుబీర్ మండలంలోని మార్లగొండ గ్రామస్తులు ఆయనను కలిసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామానికి పెద్ద సంఖ్యలో ఇండ్లు కేటాయించి పేదలకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ప్రత్యేక చొరవ చూపిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ముందుకు సాగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్లగొండ గ్రామ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ విఠల్-రుక్మిణి దేవస్థాన పాదయాత్రలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్

## - భక్తులతో కలిసి అడుగులు వేసిన భైంసా నాయకులు

**భైంసా, జులై 04, ప్రభాతవార్త:**



భైంసా మండలం, చుట్టుపక్కల గ్రామాల నుండి మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ విఠల్-రుక్మిణి స్వామివారి దర్శనం కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో కాలినడక పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో భైంసా ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్ పాల్గొని భక్తుల్లో ఉత్సాహం నింపారు. యాత్రలో పాల్గొన్న భక్తులతో కలిసి ఆయన శ్రీ విఠల్-రుక్మిణి స్వామివారిని స్మరిస్తూ, మంగళ వాయిద్యాలు, భజనల మధ్య భక్తిభావంతో నడిచారు. ఈ సందర్భంగా మోహన్ రావు పాటిల్ మాట్లాడుతూ.. పాదయాత్రలో పాల్గొన్న ప్రతి భక్తునికి స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. కాలినడకన వెళ్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, ప్రజా ట్రస్ట్ ప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రముఖులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# సాధికారతకు నైపుణ్యాభివృద్ధే మార్గం: ఏ. శ్రీనివాసరెడ్డి

**మందమర్రి, జూలై 04, ప్రభాతవార్త**

మహిళలు కుట్టు శిక్షణ వంటి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వయోజన విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు ఏ. శ్రీనివాసరెడ్డి అన్నారు. వయోజన విద్యాశాఖ జిల్లా ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సచ సహకారంతో వంద రోజుల కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సంచాలకులు ఏ. శ్రీనివాసరెడ్డికి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు కుట్టు శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. మధ్యలో చదువు మానేసిన మహిళలు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్, ఓపెన్ డిగ్రీ వంటి అవకాశాలను వినియోగించుకుని తమ విద్యను కొనసాగించాలని కోరారు. చదువుకున్న మహిళలు చదువురాని వారికి విద్యను అందించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పరీక్ష ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. వయోజన విద్యాశాఖ నిజామాబాద్ జిల్లా డైరెక్టర్ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాలు వంద రోజుల పాటు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ శిక్షణలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. మంచిర్యాల ప్రాజెక్టు అధికారి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళల్లో నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సచ క్లబ్ అడ్మినిస్ట్రేటర్, డీఆర్‌పీ బండ శాంకరి, సుమన్ అధ్యక్షత వహించగా, కుట్టు శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ఆర్గనైజర్ ఉప్పులేటి నరేష్, శిక్షకురాలు ఉప్పులేటి శారదతో పాటు పలువురు శిక్షణార్థులు పాల్గొన్నారు.



# పాఠశాలలో అల్లూరి సీతారామరాజు, గుల్జారిలాల్ నంద జయంతి వేడుకలు

**నిర్మల్, జూలై 04, ప్రభాతవార్త:**

దేశం కోసం ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన మాజీ ప్రధాని గుల్జారిలాల్ నంద జయంతి వేడుకలను దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలోని ప్లేయర్ పాఠశాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో విద్యార్థులు అల్లూరి గిరిజన పోరాటం, గుల్జారిలాల్ నంద సరళ జీవనం గురించి చేసిన ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. పుస్తకాల్లో చదివే పాఠాలే కాకుండా, మహనీయుల జీవితాలను నిజమైన పాఠాలుగా స్వీకరించాలని కోరారు. వారి దేశభక్తిని, నిజాయితీని ప్రతి విద్యార్థి అలవర్చుకున్నప్పుడే దేశం ముందుకు వెళ్తుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## టీచర్లకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాన్ని విరమించుకోండి

**- విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి**

**- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలాస సత్యనారాయణ**

చెన్నూరు, జూలై 4, ప్రభాతవార్త



ఉపాధ్యాయులకు అల్పాహారం,మధ్యాహ్న భోజనం పెట్టాలని కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం సరైంది కాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలాస సత్యనారాయణ అన్నారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ప్రవేశపెడుతూ క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం సరైంది కాదని తప్పుపట్టారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న 6 డీఏలు, పీఆర్సీ లాంటివి అడిగితే అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ పథకం వల్ల ఖర్చు అయ్యే నిధులతో మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు పెంచాలని, పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలని సూచించారు.



## మందమర్రిలో న్యాయ సేవలకు కొత్త అధ్యాయం

**- త్వరలో అందుబాటులోకి నూతన కోర్టు భవనం**

**- ప్రారంభ ఏర్పాట్లను న్యాయవాదులతో కలిసి జడ్జి సమీక్ష**

మందమర్రి, జూలై 04, ప్రభాతవార్త

ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన కోర్టు భవనాన్ని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నిర్మల శనివారం సందర్శించి పరిశీలించారు. భవనంలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె, కోర్టు కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలోని మౌలిక వసతులు, సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, సీనియర్ న్యాయవాదులు సందాని, మేకల రాజన్న, ఆర్.ఆర్. రాములు, సత్తన్న, సదయ్య, రమణ, కిన్నెర్ల శ్రీనివాస్, రంజిత్ గౌడ్, కట్ల శ్రీనివాస్, అయిల్లా లక్ష్మన్‌తో పాటు మందమర్రి మండలానికి చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాలకు వెళ్లొద్దు ప్రాణాలకు ముప్పు

**- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు రూరల్ సీఐ ఆర్. కృష్ణ హెచ్చరిక**

వేమనపల్లి, జూలై 4, ప్రభాతవార్త




ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా కోటపల్లి, వేమనపల్లి మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ సూచించారు. ప్రాణహిత నదితో పాటు వాగులు, వంకలు, చెరువులు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వరద నీటిలో సెల్ఫీలు దిగడం, స్నానం చేయడం, చేపల వేటకు వెళ్లడం, నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. వర్షాల కారణంగా పాత మట్టి ఇళ్లు కూలిపోయే అవకాశం ఉన్నందున అలాంటి ఇళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అలాగే, విద్యుత్ తీగలు తెగిపడిన చోట్లకు వెళ్లవద్దని, తడిసిన చేతులతో విద్యుత్ పరికరాలు ఉపయోగించవద్దని తెలిపారు. వరదలు, ఇళ్లు కూలే ప్రమాదం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే ప్రాణనష్టాన్ని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

# బెల్లంపల్లిలో ఆస్తి పన్నుల రివిజన్ ప్రారంభం

**- ప్రజల సహకారం కోరిన మున్సిపల్ కమిషనర్**

బెల్లంపల్లి, జూలై 04, ప్రభాతవార్త




బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, షాపులు మరియు ఇతర భవనాలకు సంబంధించిన ఆస్తి పన్నుల రివిజన్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు మున్సిపల్ పరిపాలన శాఖ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కొనసాగుతోంది. బెల్లంపల్లి పట్టణ పరిధిలోని ప్రతి ఇంటి, ప్రతి షాపు, ప్రతి వాణిజ్య భవనం యొక్క ప్రస్తుత వివరాలను సేకరించి, వాస్తవ కొలతల ఆధారంగా పన్నులను సవరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం మున్సిపాలిటీ పరిధిలో 10 ప్రత్యేక సర్వే బృందాలను నియమించారు. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి భవనాల పొడవు, వెడల్పు, నిర్మాణ విస్తీర్ణం, వినియోగ విధానం (నివాసం/వాణిజ్యం), అంతస్తుల సంఖ్య, నిర్మాణ రకం వంటి వివరాలను నమోదు చేస్తున్నాయి. ఆధునిక కొలత పరికరాలతో భవనాలను కొలుస్తూ, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్నులను రివైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఆస్తి పన్నులు ప్రధాన ఆదాయ వనరని తెలిపారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధి వంటి మౌలిక వసతులను మెరుగుపరచడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వే బృందాలు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, భవనాలకు సంబంధించిన సరైన వివరాలను అందించాలని కమిషనర్ కోరారు. భవనాల కొలతలు తీసుకునేందుకు సిబ్బందికి అనుమతి ఇవ్వాలని, ఎటువంటి సమాచారం దాచిపెట్టకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల నిర్మించిన అదనపు గదులు, కొత్త అంతస్తులు, షాపులుగా మారిన భవనాలు లేదా వినియోగంలో మార్పులు జరిగినట్లయితే వాటిని తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన పన్ను నిర్ణయించబడుతుందని తెలిపారు. సర్వే బృందాలు అధికారిక గుర్తింపు కార్డులతోనే ప్రజలను సంప్రదిస్తాయని, ఎవరైనా తప్పుడు వివరాలు సేకరించేందుకు ప్రయత్నించినా లేదా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని హెచ్చరించారు. ఈ ఆస్తి పన్నుల రివిజన్ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి అవకతవకలకు తావు ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. బెల్లంపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా మున్సిపాలిటీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి సహకరించాలని కమిషనర్ తన్నీరు రమేష్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తన్నీరు రమేష్, ఆర్.ఓ.ఆర్. భుజంగరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్యాపిటల్ క్వాలిటీ అధికారులకు ఎస్‌పీపై అవగాహన సదస్సు

**- బొగ్గు గ్రేడ్, నాణ్యతా**

**వివరాల నమోదుపై ప్రత్యేక శిక్షణ**

నస్పూర్, జూలై 4, ప్రభాతవార్త

బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని క్వాలిటీ విభాగం అధికారులు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు మరియు సిబ్బందికి శనివారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఒకరోజు ఎస్‌ఏపీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం పి. వీరభద్రరావు అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల క్వాలిటీ ఇన్‌చార్జ్‌లు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌లు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వినియోగదారులకు గ్రేడ్ల వారీగా సరఫరా చేసే బొగ్గు నాణ్యతా ప్రమాణాలు, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఎస్‌ఏపీ సాఫ్ట్‌వేర్‌లో ఏ విధంగా ఖచ్చితత్వంతో పొందుపరచాలనే అంశంపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. క్వాలిటీ వ్యవహారాలకు సంబంధించి రోజువారీ విధుల్లో ఎస్‌ఏపీని సంపూర్ణంగా ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో నిపుణులు వివరించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి విచ్చేసిన ఎస్‌ఏపీ నిపుణులు జి. రవికుమార్, అనుదీప్‌లు సిబ్బందికి సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, బెల్లంపల్లి క్వాలిటీ ఇన్‌చార్జ్ రాజేష్, మందమర్రి క్వాలిటీ ఇన్‌చార్జ్ ప్రదీప్, క్వాలిటీ ల్యాబ్ ఇన్‌చార్జ్ మోహన్‌లతో పాటు మూడు ఏరియాల ఉద్యోగులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.



**క్వాలిటీ అధికారులకు ఎస్‌పీపై అవగాహన కల్పిస్తున్న జీఎం వీరభద్రరావు, కార్పొరేట్ ప్రతినిధులు**



## లోక్ అదాలత్, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం

**- ప్రజలు తమ చట్టపరమైన హక్కులను**

**తెలుసుకోవాలి: సీనియర్ సివిల్ జడ్జి ఎ. నిర్మల**

మందమర్రి, జూలై04, ప్రభాతవార్త

ప్రజలు తమ చట్టపరమైన హక్కులపై అవగాహన పెంపొందించుకొని అవసరమైనప్పుడు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ. నిర్మల సూచించారు. మందమర్రి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మెప్మా గ్రూప్ రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి లోక్ అదాలత్ – ఉచిత న్యాయ సేవలు అంశంపై లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొబైల్ వ్యాన్ ద్వారా దృశ్య ప్రదర్శన ఏర్పాటు చేసి, న్యాయ వ్యవస్థ, ఉచిత న్యాయ సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ఎ. నిర్మలను మున్సిపల్ కమిషనర్ టి. రాజలింగు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జడ్జి ఎ. నిర్మల మాట్లాడుతూ మహిళలపై జరిగే అన్యాయాలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, భూ వివాదాలు, గృహహింస, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ముందస్తు జాగ్రత్తలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలపై సమగ్రంగా వివరించారు. న్యాయం కోసం ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరూ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రాజలింగు, బార్ అసోసియేషన్ మంచిర్యాల అధ్యక్షుడు కొత్త సత్తయ్య, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.డి. సందాని, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఆర్.ఆర్. రాములు, ఎస్. సదయ్య, న్యాయవాదులు, రెవెన్యూ అధికారి పి. కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, మున్సిపల్ అధికారులు, మెప్మా ఇన్‌చార్జి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఎ. రఘురాం, మెప్మా గ్రూప్ రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాల రక్షణ కోసం ఏ స్థాయికైనా వెళ్లి పోరాడుతాం

**- డాక్టర్ బి. జనక్ ప్రసాద్ - గనుల్లో వరుస ప్రమాదాలపై శ్రీరాంపూర్ జీఎంతో ఐఎన్టీయూసీ నేతల సుదీర్ఘ చర్చ**

**నస్పూర్, జూలై 4, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల భద్రత విషయంలో ఐఎన్టీయూసీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని, వారి ప్రాణాల రక్షణ కోసం ఏ స్థాయికైనా వెళ్లి పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌ను వారి కార్యాలయంలో కలిసి గనుల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై సమగ్రంగా చర్చించింది. ఆర్‌కే న్యూటెక్, ఎస్ఆర్‌పీ3 గనుల్లో వరుసగా జరిగిన ప్రమాదాల్లో కార్మికులు గాయపడటంపై ఈ సందర్భంగా ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి లక్ష్యాల పేరుతో కార్మికులపై తీవ్ర పని ఒత్తిడి పెంచడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే గనుల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయని బి. జనక్ ప్రసాద్ విమర్శించారు. తగిన మ్యాన్‌పవర్, రక్షణ సామాగ్రి కొరతను అధిగమించి ప్రమాదరహిత వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షేత్రస్థాయి మైనింగ్ స్టాఫ్‌ను బాధ్యులను చేస్తూ ఉన్నతాధికారులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం సరికాదన్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ అంశాన్ని డీజీఎంఎస్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు పి.తిరుపతి రాజు, గరిగ స్వామి, ల్యాగల శ్రీనివాస్, సిహెచ్ భీమ్‌రావు, కలవేని శ్యామ్, జీవన్ జోయల్, పేరం రమేష్, ఏ. రవీందర్ రెడ్డి, పెన్నింటి మల్లారెడ్డి, ఆర్. గోపాల్ రెడ్డి, జీవన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

## విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**- తపస్ జిల్లా అధ్యక్షుడు బగ్గని రవి కుమార్**

**తాండూర్ జూలై 4, ప్రభాతవార్త :**

విద్యరంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బగ్గని రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్నకు తపస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్లో ఉన్నటువంటి డిఎలను విడుదల చేయాలన్నారు. పి.ఆర్.సిని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓపిఎస్ అమలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం క్యాబినెట్ మీటింగ్లో ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు మధ్యాహ్న భోజనం, టిఫిన్లు పాఠశాలలో పెడుతున్నామని ప్రకటించడం సరి కాదన్నారు. మంత్రివర్గ ప్రకటన ఉపాధ్యాయులను సమాజంలో చులకన చేసే విధంగా ఉందన్నారు. మంత్రివర్గ ప్రకటనను వెంటనే ఉప సంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్, మండల అధ్యక్షుడు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సంఘం నాయకులు విద్యాసాగర్, రమేష్, రవి బాబు, వినోద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో ఓటరుగా నమోదు చేసుకున్న వృద్ధురాలు

**తాండూర్, జూలై 4, ప్రభాతవార్త :**

91 ఏళ్ల వృద్యాపంలో ఓటు హక్కు పట్ల తన బాధ్యతను చాటుతూ తాండూర్ గ్రామ పంచాయతీకి చెందిన దుర్గం బక్కుబాయి ఓటరుకు నమోదు చేసుకుని అందరికి ఆదర్శంగా నిలిచింది. వృద్ధాప్యం వయస్సుకే గాని దేనికి అడ్డంకి కాదని నిరూపిస్తూ వృద్ధురాలు సంబంధిత 124 పోలింగ్ కేంద్రానికి శనివారం వెళ్లి ఎస్ఐఆర్ కు సంబంధించిన గణన ఫారాన్ని నింపి స్థానిక బి.ఎల్.ఓ విజయలక్ష్మి మ్మకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఏ అబ్దుల్ రెహమాన్ ఖాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎండి జుబేర్, తదితరులు పాల్గొన్నారు.



## బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రత్యేక పూజలు

**- ముథోల్ మాజీ శాసనసభ్యునికి ఆలయ అర్చకుల ఆశీర్వచనం**

**భైంసా, జులై 04, ప్రభాతవార్త:**



ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ముథోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి శనివారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విఠల్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బాసర మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ ఎస్‌డీ అలీ, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జడ్పీటీసీలు ఉత్తమ్ భలే రావు, కొత్తపల్లి బుచ్చన్న, మాజీ సర్పంచ్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, మల్కన్న, పత్రి ప్రసాద్, నర్సింగ్ రావు, సాగర్ రావు, మోలాకాన్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

## బీసీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల ఆహ్వానం

**- సంవత్సరానికి రూ.4,000 ఆర్థిక సాయం**

**- ఎస్ఎస్‌పి ఓటీఆర్ ద్వారా నమోదు తప్పనిసరి**

**- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్**

**నిర్మల్, జులై 04, ప్రభాతవార్త:**

2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న వెనుకబడిన తరగతుల (బీసీ) విద్యార్థుల నుంచి ప్రీమెట్రిక్ ఉపకారవేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4,000 చొప్పున ఉపకారవేతనం మంజూరు చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**దరఖాస్తు విధానం:** దరఖాస్తుదారులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎస్ఎస్‌పి ఓటీఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో ఆధార్, ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా 14 అంకెల ఓటీఆర్ సంఖ్యను పొందాల్సి ఉంటుంది. అనంతరం మీసేవా కేంద్రాల ద్వారా ఈ పాస్ వెబ్‌సైట్‌లో కొత్త దరఖాస్తు లేదా పునరుద్ధరణ (రెన్యూవల్) దరఖాస్తును సమర్పించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత ఆయా ధృవీకరణ పత్రాల నకళ్ళను నిర్మల్ ఎల్లాపల్లిలోని ఐడీఓసి (కలెక్టరేట్) భవనంలో గల రూమ్ నంబర్ ఎఫ్3లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేరుగా అందజేయాలి.

**అర్హతలు, అవసరమైన పత్రాలు:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.00 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా జతపర్చాలి. ఆన్‌లైన్ దరఖాస్తులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరిశీలించి, అర్హులైన విద్యార్థుల జాబితాను వసతి గృహ సంక్షేమ అధికారులకు పంపుతారు. మెరిట్, అర్హత, పాఠశాల రికార్డుల ఆధారంగా ఈ ఉపకారవేతనాలు మంజూరు చేస్తారు. అర్హులైన బీసీ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డి.శ్రీనివాస్ కోరారు.



## కేజీబీవీలో ఉచిత యూనిఫామ్‌ల పంపిణీ

**వేమనపల్లి, జూలై 4, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం నీల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత స్కూల్ యూనిఫామ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, ఎంఈవో బి. శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి మధు, స్పెషల్ ఆఫీసర్ మయూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత యూనిఫామ్‌లు, పుస్తకాలు, ఇతర సౌకర్యాలను అందిస్తోందన్నారు. స్థానిక మహిళా సంఘాలతో యూనిఫామ్‌లు కుట్టించడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు అందించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్ ఉపాధ్యాయులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న సింగరేణి మహిళా అధికారులు

## ఆరో రోజుకు చేరిన సింగరేణి అధికారుల దీక్ష

**- పాల్గొన్న మహిళా అధికారులు**

**నస్పూర్, జూలై 4, ప్రభాతవార్త**

సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. శ్రీరాంపూర్ ఏరియాలో కురుస్తున్న వర్షంలోనూ మహిళా అధికారులు సుమలత (ఏజీఎం), వరలక్ష్మి (మేనేజర్), పద్మ (సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్), అసిస్టెంట్ మేనేజర్లు లిచత, ప్రత్యూష, లక్ష్మి తదితరులు దీక్షలో కూర్చున్నారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిల చెల్లింపుపై యాజమాన్యం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సాయంత్రం ఏరియా అధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షకు సంఘీభావం ప్రకటించారు. జూలై 13 వరకు జరిగే ఈ దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

**ఆసిఫాబాద్, జులై 4, ప్రభాతవార్త :**

అర్హులైన ప్రతి ఒక్క లబిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని మాజీ ఎంఎల్‌ఏ ఆత్రం సక్కు, మాజీ డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావులు అన్నారు. శనివారం మండలంలోని బూరుగూడ గ్రామంలో నేరేళ్ల శ్రీనివాస్ ప్రేమల దంపతుల ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అన్నారు. అనంతరం ఆ దంపతులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట బూరుగూడ మాజీ ఎంపీటీసీ మేకర్తి శ్రీనివాస్, నాయకులు నిచల్, ఆసీఫ్, గాజుల జలపతి తదితరులు ఉన్నారు.



## ఎన్ఆర్ఈజీఎస్‌తో పశుపోషకులకు అండ..
## పశువుల షెడ్ల నిర్మాణానికి ముందుకు రావాలి

**- బారెగూడలో లబ్ధిదారురాలికి రూ.60,708 చెక్కు అందజేసిన సర్పంచ్ కోట వేణుగోపాల్**

కాగజ్‌నగర్ రూరల్, జూలై 4, ప్రభాతవార్త :



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా పశుపోషకులకు ప్రభుత్వం కల్పిస్తున్న పశువుల షెడ్ నిర్మాణ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బారెగూడ గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద పశువుల షెడ్ నిర్మించుకున్న లబ్ధిదారురాలు మేడిపల్లి రేణుకకు రూ.60,708 విలువైన చెక్కును సర్పంచ్ కోట వేణుగోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువులకు శాశ్వత రక్షణ కల్పించడంతో పాటు పశుసంపద అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గ్రామంలోని రైతులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పశువుల షెడ్ల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల వేదికలో
## బెల్లంపల్లి వ్యక్తికి కీలక బాధ్యతలు

బెల్లంపల్లి, జూలై 04, ప్రభాతవార్త



తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీకే) ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన తోటపల్లి రాజేశ్వర్‌కు బాధ్యతాయుత పదవిని కేటాయిస్తూ నియామక పత్రం జారీ చేశారు. రాష్ట్ర చైర్మన్ నారాల సత్యనారాయణ మరియు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశం సంతకాలతో ఈ నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. లేఖలో పేర్కొన్న ప్రకారం, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన వ్యక్తి బెల్లంపల్లి పట్టణంలోని నివాసి కాగా, ఆయన సామాజిక సేవా దృక్పథం మరియు ఉద్యమపరమైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యత అప్పగించినట్లు నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన, సంక్షేమ పథకాల అమలు, మరియు సంఘటిత శక్తిని పెంపొందించడంలో చురుకైన పాత్ర పోషించాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే, వేదిక కార్యక్రమాలను గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ నియామకంతో ఉద్యమకారుల మధ్య ఐక్యత పెంపొందడంతో పాటు, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

**- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ - ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహణ**

నిర్మల్, జులై 04, ప్రభాతవార్త:



నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట మొదటి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ ప్రజల బానిసత్వపు సంకెళ్లను తెంచేందుకు దొడ్డి కొమురయ్య ఎంతో తెగువతో పోరాడారని కొనియాడారు. ఆనాటి కాలంలో దొరల ఆగడాలపై, నిజాం అణచివేతపై ఆయన చేసిన వీరోచిత పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు.ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాది అని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సభలో పాల్గొన్న పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరుడికి అంజలి ఘటించారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహన సమావేశం

జన్నారం, జూలై 4, ప్రభాతవార్త

జన్నారం మండల కేంద్రంలోని ఎమ్‌పిడివో సమావేశ మందిరంలో తహశీల్దార్ బక్కయ్య ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ప్రతీ ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫామ్ పూర్తిగా పూరించి ఈ నెల ఇరవై నాలుగు తేదీలోపు బిఎల్‌వోకు సమర్పించే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని సమావేశంలో పాల్గొన్న తహశీల్దార్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్‌ఏలు, వివిధ గ్రామాల సర్పంచులకు అవగాహన కల్పించారు. గడువులోగా సమర్పించని వారి పేరు జూలై 31వ తేదీ నాడు ప్రచురించబడే ముసాయిదా ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని తెలియచేస్తూ ప్రతీ అర్హత కలిగిన ఓటరు గడువులోగా తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 04, ప్రభాతవార్త



2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ సమన్వయకర్త రామ కళ్యాణి తెలిపారు. జిల్లాలోని బాలుర జూనియర్ కళాశాలలు (బెల్లంపల్లి, సీఓఈ జైపూర్, మంచిర్యాల, కాసిపేట) మరియు బాలికల జూనియర్ కళాశాలలు (లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి)లో కొన్ని ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు జూలై 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. బాలికల కోసం లక్షెట్టిపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో, బాలుర కోసం జైపూర్‌లోని కళాశాలలో ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభమవుతుంది. అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు దరఖాస్తుల నమోదు, మధ్యాహ్నం 1 గంటకు మెరిట్ జాబితా ప్రకటన, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

**కలిగి ఉండవలసిన అర్హతలు:**

మార్చి 2026లో జరిగిన ఎస్ఎస్‌సి/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ పరీక్షల్లో ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి. 10వ తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం, కుల రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. మంచిర్యాల లేదా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారై ఉండాలి. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు కూడా ఇంగ్లీష్ మీడియం కళాశాలలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒరిజినల్ మార్కుల మెమో తప్పనిసరిగా సమర్పించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు మించకూడదు. ఈ ఆదాయ ధృవీకరణ పత్రం తహశీల్దార్ ద్వారా జనవరి 1, 2026 లేదా అంతకు ముందు జారీ అయి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 31 ఆగస్టు 2026 నాటికి 17 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ అభ్యర్థులకు ఒక సంవత్సరం వయోపరిమితి సడలింపు ఉంటుంది. కౌన్సిలింగ్ సమయంలో విద్యార్హతలతో పాటు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఒరిజినల్‌గా సమర్పించాలి. 2026-27 గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఇప్పటికే జోనల్ కార్యాలయంలో లేదా ఇతర కళాశాలల్లో దరఖాస్తు చేసిన వారు కూడా స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. సీటు పొందిన అభ్యర్థులు మరుసటి రోజు కళాశాలలో చేరాలి. జూలై 10లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించని పక్షంలో అడ్మిషన్ రద్దు చేయబడుతుంది.

# బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలి

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి**

వేమనపల్లి, జూలై 4, ప్రభాతవార్త




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) కీలక పాత్ర పోషించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి అన్నారు. వేమనపల్లి మండలం నీల్వాయిలో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌ఏల అవగాహన సదస్సులో ఆయన, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆర్. సంతోష్ కుమార్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీఎల్‌ఏలకు సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్‌ఏలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, సర్పంచులు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.